క్లుప్తంగా

తహసీల్దార్‌గా జగత్‌సింగ్ బాధ్యతల స్వీకరణ



ఎల్కతుర్తి : స్థానిక తహసీల్దార్‌గా జగత్‌సింగ్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన కరీంనగర్ కలెక్టరేట్ నుంచి తొలుత హన్మకొండకు బదిలీ అయ్యారు. అనంతరం అక్కడి నుంచి ఎల్కతుర్తికి నియమితులయ్యారు. విధుల్లో చేపట్టిన సందర్భంగా జగత్‌సింగ్‌కు రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

మీడియా పాయింట్ కమిటీ ఎన్నిక



అధ్యక్షుడు కరుణాకర్

ధర్మసాగర్ (వేలేరు) : వేలేరు మండల మీడియా పాయింట్ కమిటీని సభ్యులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏలూరి కరుణాకర్, ఉపాధ్యక్షుడిగా నలివేల దిలీప్, ప్రధాన కార్యదర్శిగా గంటి చంద్రమోహన్, గౌరవ అధ్యక్షుడిగా జిల్లెల నారాయణ, సలహాదారుగా కొయ్యడ రాజు ఎన్నికయ్యారు. అనంతరం మండలంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు రేణుకుంట్ల వెంకన్న, మేక రాజు, కొయ్యడ సురేష్ ఆధ్వర్యంలో నూతన కమిటీని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

సమరశీల పోరాటాలతోనే విద్యారంగ పరిరక్షణ



ఎల్కతుర్తి : సమరశీల పోరాటాలతోనే విద్యారంగ పరిరక్షణ సాధ్యమని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్ స్పష్టం చేశారు. మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఉట్కూరి ప్రణీత్ గౌడ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన 11వ మండల మహాసభకు సంతోష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఉద్యమాలు నిర్మిస్తున్నట్టు తెలిపారు. మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, పాఠశాలల్లో నెలకొన్న అన్ని సమస్యలనూ పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముంజ పూర్ణగౌడ్, ఉపాధ్యక్షులుగా చిర్ర సాయిచంద్, బోనగిరి కుమార్, ప్రధాన కార్యదర్శిగా మాచర్ల రాజాగౌడ్, సహాయ కార్యదర్శిగా ఉట్కూరి సాయికుమార్, సభ్యులుగా కంచర్ల రాకేష్, శ్రీకాంత్, అజయ్, కిరణ్, వెంకటేష్, ఆనంద్ తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి రవితేజ, గడ్డం అఖిల్ పాల్గొన్నారు.

స్లాబ్ సెంట్రింగ్ సామగ్రి చోరీ

పరకాల : పట్టణంలోని రాజిపేట కాలనీలోని మేస్త్రీ బిట్ల రాజు ఇంటి ముందున్న రూ.38 వేల విలువైన సెంట్రింగ్ సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. ఈనెల 4న చోరీ జరిగినట్టు ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివకృష్ణ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

శాయంపేట : మండలంలోని తహరాపూర్ గ్రామానికి చెందిన మిషన్ భగీరథ కాంట్రాక్టర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు అల్లం రాజకొమురయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సోమవారం పరామర్శించారు. తొలుత రాజకొమురయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే పూలు చల్లి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్, పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ రేణుకుంట్ల సదయ్య, సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య, మాజీ సర్పంచ్ జిన్నా రాజేందర్, ఎంపీటీసీ గొట్టిముక్కల స్వాతి విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపసర్పంచ్ సుమన్, నాయకుడు ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు అండగా ఉంటా

శాయంపేట : పేద కుటుంబాలకు అండగా ఉంటానని టీపీసీసీ సభ్యుడు గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన మార్త వెంకటయ్య, వంగరి శంకర్, ప్రగతిసింగారం గ్రామానికి చెందిన మునుకుంట్ల రణధీర్, కొప్పులకు చెందిన భగ్గి సాంబయ్య అనారోగ్యాలతో బాధపడుతూ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను గండ్ర సత్యనారాయణ సోమవారం కలిసి మాట్లాడారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి నాయకులు చిందం రవి, బాసాని మార్కండేయ, మారపల్లి క్రాంతి, కుక్కల భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : నివాళులర్పిస్తున్న ప్రవీణ్‌రెడ్డి, ఇతరులు



శాయంపేటలో..



కమలాపూర్‌లో..



గద్దర్ మృతి తీరని లోటు

ఎల్కతుర్తి : ప్రజాగాయకుడు గద్దర్ మృతి ప్రజాఉద్యమాలకు తీరని లోటని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. భీమదేవపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద గద్దర్ చిత్రపటానికి ప్రవీణ్‌రెడ్డి సోమవారం పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. గద్దర్ ఆటపాటలతో ప్రజాచైతన్యానికి బాటలు వేశారని కొనియాడారు. తెలంగాణ సాధనలో గద్దర్ పాత్ర మరువలేనిదని చెప్పారు. ఎల్కతుర్తిలో తెలంగాణ పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం రఘు ఆధ్వర్యంలో గద్దర్‌కు నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమాల్లో నాయకులు చిట్టంపల్లి అయిలయ్య, కేతిరి లక్ష్మారెడ్డి, కుడకండ్ల సుదర్శన్‌రెడ్డి, మంగ రామంద్రం, నాగరాజు, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

పరకాల : స్థానిక కోర్టులో న్యాయవాద జేఏసీ చైర్మన్ ఒంటేరు రాజమౌళి ఆధ్వర్యంలో రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మేరుగు శ్రీనివాస్, పి.నెహ్రునాయక్, లక్కం శంకర్, టి.సురేష్‌కుమార్, ఒంటేరు పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

దామెర : మండలంలోని పులుకుర్తిలో గద్దర్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోవిందు సంధ్య అశోక్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు జిల్లెల్ల మురళీ, మాజీ సర్పంచ్ పెరుక సత్యం, పీఏసీఎస్ డైరెక్టర్ ఈదునూరి స్వామి, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దండు రాజు, అంకేశ్వరపు నగేష్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొత్త గోపాల్, అంకేశ్వరపు రాజు, ఎంఎస్ఎఫ్ మండల నాయకులు గోవిందు మహిపాల్, దండు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



దామెర : నివాళులర్పిస్తున్న ఎంపీటీసీ, తదితరులు

శాయంపేట : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గద్దర్ చిత్రపటానికి టీపీసీసీ సభ్యుడు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, నాయకులు చిందం రవి, మారెపెల్లి రాజేందర్, రఫీ, వలీ హైదర్, మార్కండేయ, కట్టయ్య, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : మండల కేంద్రంలోని బస్టాండ్ జంక్షన్‌లో గద్దర్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుండపు చరణ్ పటేల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేశిని ఐలయ్య గౌడ్ మాట్లాడారు. గద్దర్ మృతి తీరని లోటన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ కోఆర్డినేటర్ తొటం రవీందర్, నాయకులు సముద్రాల కృష్ణ, కంభంపాటి ప్రసాద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయం

● జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్

ఎల్కతుర్తి : ప్రజాసంక్షేమే బీఆర్ఎస్ పార్టీ ధ్యేయమని జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్ తెలిపారు. భీమదేవరపల్లి మండలంలోని ములక్నూర్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బండి సంజయ్ అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమన్నారు. సమావేశంలో ఎంపీపీ జక్కుల అనిత రమేష్, జెడ్పీటీసీ వంగ రవీందర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మారుపాటి మహేందర్ రెడ్డి, సర్పంచ్‌లు మండ సురేష్, అబ్బని పద్మ, గుగులోతు పంతులు, మాడ్గుల కొమురయ్య, వంగ సురేష్, బొల్లంపల్లి రమేష్, మాడ్గుల ఎల్లా, సురేందర్, మాజీ ఎంపీపీ సంపత్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తిరుపతి, తదితరులు

● యూఎస్‌పీసీ రాష్ట్ర బాధ్యుడు తిరుపతి

ఎల్కతుర్తి : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని యూఎస్‌పీసీ రాష్ట్ర బాధ్యుడు నన్నెబోయిన తిరుపతి విమర్శించారు. భీమదేవరపల్లి మండలంలోని ములక్నూర్‌లోని మోడల్ స్కూల్‌లో ఆందోళన వాల్‌పోస్టర్లను సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఎనిమిదేళ్లుగా ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు, ఆరేళ్లుగా బదిలీలు లేవని తెలిపారు. ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్ చేపట్టకపోవడంతో పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, రెండో పీఆర్సీ కమిషన్‌ను వెంటనే ప్రకటించి ఐఆర్‌ను విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల అన్ని బిల్లులనూ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12న జిల్లా కేంద్రాల్లో తలపెట్టిన ర్యాలీ, మహాధర్నాల్లో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూఎస్‌పీసీ మండల బాధ్యులు కాలేసి కొమురయ్య, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు శిశువుకు శ్రేయస్కరం



ఆత్మకూరు : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుశీల



శాయంపేట : మాట్లాడుతున్న సర్పంచ్ మమత

ఆత్మకూరు : తల్లిపాలతో శిశువు ఆరోగ్యానికి మేలు జరుగుతుందని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుశీల తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో తల్లిపాల ప్రయోజనాలపై నాటక ప్రదర్శనలు నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుశీల మాట్లాడారు. పుట్టిన వెంటనే శిశువుకు ముర్రుపాలు పట్టించాలని సూచించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి స్పందన మాట్లాడారు. రెండేళ్ల వరకు పిల్లలకు అదనపు ఆహారంతోపాటు తల్లిపాలు కొనసాగించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, సీడీపీఓ భాగ్యలక్ష్మి, ఉపసర్పంచ్ స్వాతి భగవాన్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : తల్లిపాలు శిశువుకు శ్రేష్ఠమని సాదోనిపల్లి సర్పంచ్ పాడమేకల మమత సంపత్ తెలిపారు. మండలంలోని ఆ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి సర్పంచ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పుట్టిన గంటలోపే ముర్రుపాలు తాగిస్తే శిశువుకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ విద్యశ్రీ, ఏఎన్ఎం శోభ, అంగన్‌వాడీ టీచర్ పారిపెల్లి రాణి, ఆశా కార్యకర్త సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

శాయంపేట : సొంత స్థలం ఉండి ఇల్లు లేని పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు చొప్పున సాయం అందించాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు పరికరాల భూమయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పంచాయతీ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సోమవారం నిరసనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా భూమయ్య మాట్లాడారు. మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన ఇల్లు లేని పేదలను పార్టీ ఆధ్వర్యంలో గుర్తించినట్లు తెలిపారు. ఇంటి స్థలం ఉన్నప్పటికీ ఆర్థిక స్థోమత లేక ఇల్లు నిర్మించుకోకుండా పాకలు వేసుకుని కొందరు, అద్దె ఇళ్లలో మరికొందరు నివాసం ఉంటున్నట్టు చెప్పారు. పేదలందరికీ ప్రభుత్వం ఇంటి నిర్మాణ సాయం అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు పెంట తిరుపతి, మంద భద్రయ్య, బుచ్చయ్య, వెంకట్‌రెడ్డి, బాబురావు, మాధవి, పోశక్క, సంధ్య, లావణ్య, దీప, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక రోడ్డు వేయాలి



నడికూడ : గత నెలలో కురిసిన వర్షాల క్రమంలో వరద తీవ్రతకు నార్లాపూర్ నుంచి వెంకటేశ్వర్లపల్లె గ్రామాల మధ్య తెగిపోయిన తారు రోడ్డు స్థానంలో తాత్కాలిక రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్డు తెగిపోవడంతో నార్లాపూర్, వెంకటేశ్వర్లపల్లి నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. వెంకటేశ్వర్లపల్లె గ్రామస్తులు మండల కేంద్రానికి, పరకాలకు వెళ్లాలంటే అదనంగా 15 కిలోమీటర్లు ప్రయాణించి కమాలపూర్ నుంచి రావాల్సిన దుస్థితి నెలకొంది. ఇకనైనా అధికారులు స్పందించి కనీసం తాత్కాలిక రోడ్డైనా వేయాలని స్థానికులు కోరుతున్నారు.

బుడిగజంగాలపై నిర్లక్ష్యం తగదు

● బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి



బుడిగజంగాల కులస్తులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి, నాయకులు

పరకాల : బుడిగజంగాల పట్ల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నిర్లక్ష్యం చేయడం తగదని బీజేపీ నేత, స్థానిక మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. పట్టణంలోని బుడిగజంగాల కాలనీని ఆయన ఆధ్వర్యంలోని పార్టీ బృందం సోమవారం కలిసి పరామర్శించింది. అనంతరం మీడియాతో భిక్షపతి మాట్లాడారు. బుడిగజంగాలు విషసర్పాల నడుమ జీవితాలు సాగిస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. బుడిగజంగాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తామని గత ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే ధర్మారెడ్డి హామీ ఇచ్చి తదనంతరం విస్మరించారని విమర్శించారు. ఎన్నికలప్పుడు మాత్రమే ఎమ్మెల్యేకు పేద బుడిగజంగాలు గుర్తుకొస్తారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే బుడిగజంగాలకు స్థలాలు కేటాయించి ఇండ్లు కట్టించాలని హితవు పలికారు. లేనిపక్షంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, కౌన్సిలర్లు కొలనుపాక భద్రయ్య, బెజ్జంకి పూర్ణాచారి, నాయకులు సంగా పురుషోత్తం, దుబాసి వెంకటస్వామి, దంచనాల సత్యనారాయణ, ఆకుల రాంబాబు, సుంకరి సమ్మయ్య, లక్క సతీష్, తదితరులు పాల్గొన్నారు.

'తొలిమెట్టు'తో సామర్థ్యాల పెంపు



ఐనవోలు : మాట్లాడుతున్న రమేష్

ధర్మసాగర్ (వేలేరు) : తొలిమెట్టు శిక్షణతో బోధనాభ్యసన సామర్థ్యాల పెరుగుతాయని కోర్స్ డైరెక్టర్, మండల నోడల్ ఆఫీసర్ మహేష్ నాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు మహేష్‌నాయక్, కాంప్లెక్స్ హెచ్‌ఎం నాగకుమారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణితశాస్త్ర శిక్షణా శిబిరాన్ని రాష్ట్ర బృందం సభ్యులు సోమవారం సందర్శించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా మహేష్‌నాయక్ మాట్లాడారు. కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. రిసోర్స్‌పర్సన్లుగా ఉపాధ్యాయులు మోయినొద్దీన్, మూల రాధిక వ్యవహరించారు. కార్యక్రమంలో సీఆర్పీ మొగిలిచర్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐనవోలు : తొలిమెట్టు గణిత శిక్షణా కార్యక్రమాన్ని కోర్సు డైరెక్టర్, ఎఫ్ఎల్ఎన్ మండల నోడల్ ఆఫీసర్ డాక్టర్ టి.రమేష్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పాక శ్రీహర్షుడు, ఆర్పీలు బ్రహ్మచారి, చిదురాల శ్రీనివాస్, సీఆర్పీలు రాజ్‌కుమార్, రేవతి, టీచర్లు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి

పరకాల : ఎస్సీ వర్గీకరణ కోసం ప్రస్తుత పార్లమెంటరీ సమావేశాల్లో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల రెండో వారంలో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ కోరారు. పట్టణంలోని సాంఘీక సంక్షేమ శాఖ హాస్టళ్లలో ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ బొచ్చు అనంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సోమశేఖర్ మాట్లాడారు. ఎన్నికలకు ముందు స్పష్టమైన హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం తర్వాత కాలయాపన చేస్తూ మోసం చేస్తున్న క్రమంలో రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. అనంతరం కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి, నాయకులు గోవిందు మహిపాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి'కి 10లోపు దరఖాస్తు చేసుకోండి

దామెర/ఆత్మకూరు : ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం కోసం పేదలు ఈనెల 10 లోపు మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని దామెర, ఆత్మకూరు, ఐనవోలు ఎంపీడీఓలు రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణ సోమవారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు. సొంత స్థలం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఆధార్, ఓటరు, రేషన్ కార్డుల జిరాక్స్‌లతోపాటు భూమి రిజిస్ట్రేషన్ పత్రాలు లేదా పట్టాదారు పాస్‌పుస్తకం, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతచేసి ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

తహసీల్దార్, ఎస్సైలకు సత్కారం



తహసీల్దార్‌ను సత్కరిస్తున్న నాయకులు



ఎస్సైకి పూలమొక్క ఇస్తున్న నాయకులు

కమలాపూర్ : తహసీల్దార్ మాధవిని, ఎస్సై సీమా ఫర్హీన్‌ను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సోమవారం వేర్వేరుగా కలిసి శాలువాతో సత్కరించారు. పూలమొక్కలు బహూకరించారు. కార్యక్రమాల్లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుండపు చరణ్ పటేల్, రాష్ట్ర కోఆర్డినేటర్ తొటం రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేశిని ఐలయ్య గౌడ్, నాయకులు సముద్రాల కృష్ణ, కంభంపాటి ప్రసాద్, అక్కినపల్లి భిక్షపతి, ప్రభాకర్‌రెడ్డి, హరిహర ప్రసాద్, లింగయ్య, అనిల్, కొండ తిరుపతి, అమ్జద్ పాషా, హనుమాన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పెంపుతోనే చేనేత అభివృద్ధి



ఆత్మకూరు : వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చేనేత కార్మికులు



పరకాల : కార్మికులను సన్మానిస్తున్న రాజేశ్వరప్రసాద్, తదితరులు

పరకాల : ఉపాధి పెరిగితేనే చేనేత రంగం అభివృద్ధి చెందుతుందని పద్మశాలీ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) అధ్యక్షుడు డాక్టర్ పోతాని రాజేశ్వర్‌ప్రసాద్ స్పష్టం చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా స్థానిక పద్మశాలి భవన్‌లో సంఘం పట్టణ అధ్యక్షుడు బాసాని దయాకర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన వేడుకలకు రాజేశ్వర్‌ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై చేనేత కార్మికులను సన్మానించారు. అనంతరం రాజేశ్వర్‌ప్రసాద్ మాట్లాడారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని కోరారు. సీతారాంపూర్‌లోని మార్కండేయ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు దుంపేటి నాగరాజు ఆధ్వర్యంలో ఆ గ్రామంలోని చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. శ్రీనివాసకాలనీలోని చేనేత సహకార సంఘం భవనంలో స్థానిక పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు దాసరి భిక్షపతి ఆధ్వర్యంలో చేనేత కార్మికులను సన్మానించారు. అనంతరం ఈనెల 13న తలపెట్టిన 'చలో కోరుట్ల' పద్మశాలి యుద్ధభేరి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో చేనేత సెల్ జిల్లా డీసీసీ ఆడెపు సంపత్, నడికూడ మండల అధ్యక్షుడు గాదె శంకరయ్య, సంఘం పరకాల మండల అధ్యక్షుడు దానం నిరంజన్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు వెల్దే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడారు. అనంతరం చేనేత దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు వడ్డేపల్లి వేణు, జాయింట్ సెక్రటరీ ఇరుసవడ్ల సదానందం, నాయకులు వెల్దే సదానందం, వెంగలదాసు వెంకట్, చిందం నరేందర్, వడ్డేపల్లి ప్రసాద్, చిమ్మని దేవరాజ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

'మణిపూర్' హింసకు నిరసనగా ర్యాలీ



వినతిపత్రం అందజేస్తున్న మార్క్, తదితరులు

ఐనవోలు : మణిపూర్‌లో హింసకు నిరసనగా మండల పాస్టర్స్ ఫెలోషిప్ (ఐఎంపీఎఫ్) మండల కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సుభాషిణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎంపీఎఫ్ అధ్యక్షుడు మార్క్ మాట్లాడారు. ప్రధాని మోదీ, మణిపూర్ సీఎం స్పందించాలని డిమాండ్ చేశారు. ఐఎంపీఎఫ్ గౌరవ అధ్యక్షుడు ప్రేమ్‌జిత్, ఉపాధ్యక్షుడు షడ్రక్, కార్యదర్శి ఏలియా, తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందాడు

● చక్రవర్తి ఆస్పత్రి ఎదుట ఆందోళన



ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

కాజీపేట: హనుమకొండలోని చక్రవర్తి ఆస్పత్రి ఎదుట సోమవారం మృతుడి కుటుంబీకులు ఆందోళన నిర్వహించారు. ఐనవోలు మండలం పున్నేలుకు చెందిన బొంతు మహేశ్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ వారం రోజుల క్రితం చక్రవర్తి ఆస్పత్రిలో చేరాడు. సోమవారం మహేశ్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించాలని సూచించగా మార్గమధ్యలో మృతిచెందాడు. కాగా వైద్యుల నిర్లక్ష్యంతోనే మహేశ్ మృతిచెందాడని, అసలు చనిపోయాకే హైదరాబాద్‌కు తరలించారని కుటుంబసభ్యులు ఆగ్రహానికి లోనై ఆస్పత్రి ఫర్నిచర్, కిటికీలు, వాటర్ ఫిల్టర్‌ను ధ్వంసం చేశారు. దీనిపై ఆస్పత్రి ఎండీ డాక్టర్ తరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మహేశ్ డయాబెటిస్‌తో బాధపడుతున్నాడని, చికిత్సకు శరీరం సహకరించకపోవడంతో మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకువెళ్లాలని సూచించామని తెలిపారు. ఆస్పత్రిపై దాడి చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.